క్లుప్తంగా

ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలు


ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు: ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలున్నాయని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని తాటాకుల దిన్నె జగనన్న కాలనీలో నిర్మించుకొంటున్న ఇంకుడు గుంతల(సోక్ పిట్)ను హౌసింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే ఉపాధి హామీ ద్వారా రూ.6 వేలు చెల్లిస్తారన్నారు. ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలను సంరక్షించుకోవడంతో పాటు రోడ్లపై మురికి నీరు పారకుండా నివారించవచ్చన్నారు. నూతనంగా ఏర్పడుతున్న జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు ఆవశ్యమైనందున ప్రతి లబ్ధిదారు విధిగా నిర్మించుకోవాలని కోరారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పొదలకూరు : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పొదలకూరు ఎస్ఈబీ సీఐ వెంకటరావు సూచించారు. మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల యువత బంగారు భవిష్యత్తు చిత్తు అవుతుందన్నారు. మాదక ద్రవ్యాలను రవాణా చేసినా, కలిగి ఉన్నా నేరమన్నారు. ఈ సదస్సులో పొదలకూరు సీఐ జి.సంగమేశ్వరరావు, ప్రిన్సిపల్ కె.విష్ణువర్ధన్, సెబ్ ఎస్సై సీహెచ్ శ్రీనివాసులు, వైద్యాధికారులు య.ప్రసాద్, శివకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులను సోమవారం బుచ్చిరెడ్డిపాళెంలో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌బాబు మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీల్లో హిమతేజస్విని, మారుతీమోహన్, లిఖిత్, యుగేష్, సాయి చరీష్ విజయం సాధించారని తెలిపారు. వీరు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



మనుబోలు : స్కూటీ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మనుబోలు బైపాస్‌రోడ్డుపై సోమవారం జరిగింది. గూడూరుకు చెందిన అయ్యప్ప స్కూటీపై నెల్లూరు నుంచి గూడూరు వెళ్తున్నాడు. మనుబోలు బైపాస్‌రోడ్డులోని సీఆర్ దాబా సమీపంలో స్కూటీ అదుపుతప్పి పడిపోవడంతో అయ్యప్పకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్ణీత గడువులోపు సమస్యలకు పరిష్కారం

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: ప్రజలు తెలియజేసే సమస్యలకు నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. స్పందనలో 30 మంది అర్జీలను సమర్పించగా, డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఏడుగురు తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలని సూచించారు. నగరంలోని రోడ్లపై గోవుల సంచారాన్ని తీవ్రంగా పరిగణించనున్నామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం, 1902, ఏపీ సేవా పోర్టల్, స్పందనకు వచ్చిన ఫిర్యాదులను రోజులో మూడు సార్లు పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.


అర్జీలను స్వీకరిస్తున్న వికాస్ మర్మత్

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, తదితర నేతలు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఎంపీని సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

• రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, బద్దెపూడి వెంకట్రావు, వెంకటరమణయ్య, తాటిపర్తి రఘురామ్, దగ్గవోలు రాజు, రియాజ్, అలీ తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ ఫలితాల్లో 'కృష్ణచైతన్య' విజయకేతనం

నెల్లూరు (టౌన్): డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను నగరంలోని కళాశాలలో సోమవారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. బీఎస్సీలో దులీషా 99.8, సుష్మ, అంజుమ్ షైఫా 99.5, సుజిత 99.2, భార్గవి 99, బీసీఏలో ధరణి ఉషా, రాజమౌనీషా 98, రుబీనా, జాహ్నవి 97, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో లక్ష్మీప్రసన్న 98, షెహనాజ్, లావణ్య, వినయ్‌కుమార్ 97 శాతం మార్కులను సాధించారని పేర్కొన్నారు. బీబీఏలో మౌనిక 94, శ్రీలేఖ్య 93, సోనీ, హర్షిత 92, బీకాంలో రాధారాణి 94, ప్రసన్న, అరుణ, లలిత, చందనప్రియ 93 శాతం మార్కులను సాధించారని వెల్లడించారు. డీన్ సుధారాణి, అడ్మిన్ డీన్ రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపల్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు (టౌన్): జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నేత్రదానంపై అవగాహన సదస్సును జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ శర్వాణి మాట్లాడారు. నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు, కార్యదర్శి బాబు, ప్రధాన కార్యదర్శి రోజారాణి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విమల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శర్వాణి

బీసీలపై టీడీపీది కపట ప్రేమ


మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు (దర్గామిట్ట): బీసీలపై టీడీపీది కపట ప్రేమ అని.. రాజకీయం కోసమే వారిని ఉపయోగించుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో ఉపాధ్యక్ష పదవి వచ్చేలా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేశారని, వారికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పార్టీ మరింత అభివృద్ధి చెందేలా శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. బీసీల పక్షపాతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. బీసీలు మాట్లాడితే కొందరికి రుచించడం లేదని, చులకన భావంతో చూస్తున్నారని టీడీపీ నేతలను విమర్శించారు. పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, పార్టీ తోటపల్లిగూడూరు కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎస్సీ సెల్ నేత అడపాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని వెంకటేశ్వర విద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని అరసం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరసం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వెంకటరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. హోమాలు, పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం స్వామివారి గోపురోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్‌ఆచారి, సభ్యుడు నరసింహాచార్యులు పర్యవేక్షించారు.



స్థల వివాదంలో వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): బైక్‌పై వస్తున్న వ్యక్తిపై కొందరు విచక్షణరహితంగా దాడి చేసిన ఘటన సౌలుచింతల సమీపంలోని ఫ్లైఓవర్‌పై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మాల్యాద్రికి స్థానికంగా ఉన్న వారికి స్థల విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో కోవూరులోని లాయర్ వద్దకు వెళ్లారు. ఆయనతో మాట్లాడిన అనంతరం నెల్లూరులోని తన మామ శేఖర్‌బాబును కలిసేందుకు బైక్‌పై బయల్దేరారు. సౌలుచింతల దాటి వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి స్థల వివాదంలో కేసులు పెడతావా అంటూ కర్రలు, రాడ్లతో విచక్షణరహితంగా దాడి చేశారు. ఇంతలో అటుగా వెళ్తున్న వారు దగ్గరికి రావడాన్ని గమనించిన దుండగులు పరారయ్యారు. గాయపడిన మాల్యాద్రి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై జీజీహెచ్ అవుట్‌పోస్ట్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. సంతపేట పోలీసులకు వారు సమాచారం అందించారు.

గాయపడిన వ్యక్తి మృతి

మనుబోలు : మండలంలోని కృష్ణపట్నం పోర్టు రోడ్డు సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మురిగేశన్(47) సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 26వ తేదీ తెల్లవారుజామున చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న ట్యాంకర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రంలోని వేలూరుకు చెందిన మురుగేశన్‌కు గాయలయ్యాయి. మొదట ఆయన్ను నెల్లూరుకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మనుబోలు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఇంటి వరండాలోకి దూసుకెళ్లిన లారీ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద ముంబై జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ట్యాంకర్ రాఘవరెడ్డి కాలనీ సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని, పక్కన ఉన్న ఇంటి వరండాలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు గాయాలు కావడంతో అతన్ని 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

క్షయ, ఎయిడ్స్ నివారణకు చర్యలు

వెంకటాచలం: క్షయ, ఎయిడ్స్ వ్యాధులను పూర్తిగా అరికట్టడానికి తమశాఖ అన్నివిధాలా కృషి చేస్తోందని జిల్లా క్షయ, ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ షేక్.ఖాదర్‌వలీ పేర్కొన్నారు. మండలంలోని కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో ఉన్న క్షయ, ఎయిడ్స్ బాధితుల వివరాల గురించి వైద్యులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయ, ఎయిడ్స్ వ్యాధుల పట్ల సమాజంలో అవగాహన పెరిగిందని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలియజేశారు. ఎయిడ్స్, క్షయ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఎప్పటికప్పుడు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించి, రోగులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవిత్ర, ప్రవల్లిక, సీహెచ్ఓ రామసుబ్బారెడ్డి, హెచ్ఈఓ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌పై దాడి ఘటనకు నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడారు.
నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. న్యాయవాదులకు ప్రత్యేక చట్టం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పూర్తి వసతులతో షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు


చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆత్మకూరు బస్టాండ్ వద్ద పూల వ్యాపారులు, స్టోన్‌హౌస్‌పేట బ్రిడ్జిపై చిరు వ్యాపారులు ఇబ్బందులు పడకుండా పూర్తి వసతులతో కూడిన షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పూల మార్కెట్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. షెల్టర్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య కొంత మేరకు పరిష్కారమవుతుందని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ మొగ్గళ్లపల్లి కామాక్షిదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు నేతాజీ సుబ్బారెడ్డి, నూనె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటశేషాచార్యులుకు పురస్కారం



నెల్లూరు(బృందావనం): జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి, ఇందుకూరుపేటలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులుకు ప్రతిభ బంగారు నంది అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డును అందుకున్నానని ఆయన చెప్పారు. ఆధ్యాత్మిక సేవలను పరిగణనలోకి తీసుకొని హైదరాబాద్‌లోని మంజునాథ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డును అందజేశారని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారన్నారు.

దీన్‌దయాళ్‌నగర్‌లో అన్నదానం

నెల్లూరు(బృందావనం): ప్రముఖ నటుడు సుమన్ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో గిరిజనులకు అన్నదానాన్ని సోమవారం నిర్వహించారు. ఆలిండియా సుమన్ యువసేన ఆధ్వర్యంలో రిషి జైదీప్ ధార్మిక ట్రస్ట్ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని చేపట్టారు. యువసేన అధ్యక్షుడు రషీద్, ఖమర్‌తాజ్, రచయిత సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ కళాశాలలపై చర్యలు చేపట్టాలి

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రూరల్ అధ్యక్షుడు సుకుమార్ కోరారు. ఈ మేరకు ఆర్ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సెలవు రోజుల్లోనూ తరగతులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నేతలు సంతోష్, ప్రియ, సిసింద్రీ, శివ, చక్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు (దర్గామిట్ట): కొండ్లపూడి పంచాయతీ నాయీ బ్రాహ్మణ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని సోమవారం సమర్పించారు. టిడ్కో ఇళ్ల సమీపం నుంచి నీటి వసతిని ఏర్పాటు చేయాలని విన్నవించారు. కాగా కమిషనర్‌తో మాట్లాడి సమస్యను ఎంపీ పరిష్కరించారు. కాలనీ అధ్యక్షుడు వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్లూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచామృతాభిషేకాలను నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నారాయణరావుకు సత్కారం నేడు

నెల్లూరు(బృందావనం): తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించనున్న తెలుగు భాషా వికాస వారోత్సవాలకు నెల్లూరుకు చెందిన కవి చిన్ని నారాయణరావుకు ఆహ్వానం అందింది. కార్యక్రమంలో తనను సత్కరించనున్నారని ఆయన వివరించారు.

శబరి శ్రీరామక్షేత్రంలో పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామ క్షేత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు పంచామృతాభిషేకం, సాయంత్రం 5.30కు సీతారాముల కల్యాణం, రాత్రి ఏడుకు ఆంజనేయస్వామికి పల్లకి సేవ, తదితరాలను నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు విశేషంగా హాజరుకావాలని కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి తోడ్పాటునందించరూ..

నెల్లూరు(బృందావనం): జిల్లాలో క్రైస్తవుల సంక్షేమానికి తోడ్పాటునందించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ దాసరి కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ అఫైర్స్ మైనార్టీ శాఖ సలహాదారు ఫాదర్ బాలస్వామి, ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ శామ్యూల్ జోనాథన్‌ను విజయవాడలో సోమవారం కలిశారు. ఫెలోషిప్ జిల్లా కార్యదర్శి రెవరెండ్ జెర్మియా, కోశాధికారి రెవరెండ్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గోవులను రోడ్లపై వదలొద్దు

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారుల్లో గోవులు సంచరిస్తే వాటి యజమానులకు జరిమానాను విధిస్తామని కమిషనర్ వికాస్ మర్మత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రహదారులపై సంచరిస్తున్న గోవులను నోటీసులను జారీ చేసిన మూడు రోజుల్లో వాటి యజమానులు తీసుకెళ్లాలని చెప్పారు. అలా కాని పక్షంలో యజమానులకు జరిమానాను విధించడంతో పాటు ఆవులను గోశాలకు తరలిస్తామని తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతలు

నెల్లూరు(పొగతోట): వైద్య, ఆరోగ్య శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో వైద్యసేవలు అందిస్తున్న అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, స్పెషలిస్ట్, డిప్యూటీ సివిల్ సర్జన్లు, స్పెషలిస్ట్ డాక్టర్లకు రూ.15 వేల ప్రత్యేక అలవెన్స్‌ను జీఓ నంబర్ 657 ద్వారా ప్రకటించారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అలవెన్స్‌లను ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు.